# "చేతులు కాలాక...."

పోలయ్య సరుకులు కొనుక్కుని ఇంటి ముఖం పట్టాడు. లచ్చికి, సీతాలుకి ఎంతో ఇష్టమైన జామపళ్ళు సంచిలోంచే ఘుమఘుమ లాడుతున్నాయి.

పిచ్చిమాలచ్చి! రోజూ తినిపెంచినా సంబరమే. లచ్చిని, సీతాలుని రెండు కళ్ళలో నింపుకుని చేతిలో నిండి ఉన్న సంచితో ఇల్లు చేరాడు.

అల్లంత దూరం నుంచే చూసి పరుగు పరుగున వచ్చేసి చేతిలో సంచి అందుకునే సీతాలు తను లోపలకు వచ్చినా అదేం పట్టనట్టే ఉంది.

లచ్చి, సీతాలు తను ఏ పని మీద బయటకు వెళ్ళినా, తిరిగి వచ్చేంతవరకు ఆటలలో మునిగి తేలేవారు. ఒక్క క్షణం విడిచి ఉండేవారా? చేతిలో సంచిలానే బరువెక్కింది పోలయ్య హృదయం.

ఇక మొయ్యలేనట్టు సంచిని దించేసాడు గడపలోనే. రూపు గట్టిన నిరుత్సాహంగా, మూగబోయిన కోయిల కూనలా ఎగరటం మర్చిపోయిన చిన్నారి పిచ్చుకలా, అలా.... అలా.... గదిలో ఓ మూల ఒదిగి ఉన్న సీతాలును చూడలేకపోతున్నాడు పోలయ్య.

లచ్చి మాత్రం చెంగు చెంగున గెంతు లేస్తూ ఇల్లాంతా సందడి చేస్తోందనా? తనలో చెలరేగుతున్న ఆరాటం వెలువరించలేక సీతాలు ఎందుకు ఇలా మారిపోయిందీ అర్థం కాక దిక్కుతోచక అయోమయంగా అటు ఇటు పచార్లు చేస్తోంది.

పోలయ్య హృదయం పగిలి పోతోంది. ఏమిటిది? ఎందుకిలా? అతని కళ్ళు. అశ్రుపూరితాలయ్యాయి. తన ప్రాణం సీతాలు. ప్రాణానికి ప్రాణం లచ్చి. ఆ జంటని ఏ శక్తులు

వేరు చేయలేవే? అన్న భావం అతనిలో మెదిలింది. పోలయ్య అచేతనంగా నిలబడిపోయాడు. లచ్చి వచ్చి కాళ్ళకు చుట్టుకునేసరికి ఉలిక్కి పడ్డాడు. ఇప్పుడు కనుక తను లచ్చిని ఎత్తుకుని, ఎప్పటిలా ముద్దు చేస్తే సీతాలు మరింత బాధపడుతుంది. లచ్చిని కర్కశంగా వదిలించుకున్నాడు.

సీతాలును సమీపించి ఆప్యాయత కురిసే స్వరంతో "సీతా! లే తల్లీ. ఇలా దిగులుపడి కూర్చున్నావేం?" సీతాలు మెదల్లేదు. "నా మాటలు వినవూ? నా బంగారు తల్లివి కావూ...." చేతులు పట్టుకుని కూతుర్ని లేపబోయాడు. తండ్రి ఎంత ఆప్యాయంగా దగ్గరకి తీసుకో ప్రయత్నించినా రెండు రోజులుగా ఆ పసి మనస్సులో కరడు కట్టుకుపోయిన ఆవేదన కరగలేదు. మరింత బిగుసుకుపోయి తండ్రికి దూరంగా జరిగింది.

"నేనేం నీ బంగారు తల్లిని కాను. అదిగో.... ఉందిగా! అదే నీకు బంగారు తల్లీ! చిట్టి తల్లీ, అన్నీ... ఆ దెయ్యంవే...."

'సీతా'! కూతురి మాటలు పూర్తికానే లేదు ఉరిమింది పోలయ్య కంఠం. మరుక్షణం తనని తాను సంభాళించుకున్నాడు.

అసలే సీత రోషం పట్టలేక పోతోంది. తనిలా కోప్పడితే మరుక్షణం "తప్పమ్మా లచ్చినలా అనొచ్చా.

"అవును ఆ దరిద్ర ముఖాన్ని ఏమి అనకూడదు" ఉక్రోషంగా అనేసి మంచం క్రింద దూరి పడుకుంది.

పెను తుఫాను రేగిన సముద్రంలా పోలయ్య మనస్సు అల్ల కల్లోలమైంది. ఆలోచనా తరంగాలు ఎగసిపడుతున్నాయి. తన లచ్చి, మా లచ్చి మీద సీతాలు కెందుకింత కోపం? చిన్న పిల్లే అయినా అన్నీ అర్థం చేసుకుని ఆరిందాలా ఇంటిని సర్వం తానే అన్నట్టు పనులన్నీ చేస్తుంది. లచ్చి అవసరాలు తీర్చటం ఎంత బాధ్యతగా అనుకుంటుంది. దానికి స్నానం చేయించటం, తిండి పెట్టడం, ఒక్కటేనా? తనని కూడా ఎంతో అప్యాయంగా చూస్తుంది. "ఎందుకమ్మా! నేను ఉడకేసి పెడతాలే అంటే "నువ్వు చిట్టితల్లి అంటావుగా, నేనే నీ తల్లిని" అంటూ పెద్ద కబుర్లు చెబుతుంది. ఈ పిల్లకి ఇంత మొండితనం ఎలా వచ్చిందబ్బా! రెండు రోజుల నుంచి ఈ మోస్తరుగానే విసిగిస్తోంది. ఉసూరుమంటూ పొయ్యి రాజేసాడు. వంట చేసి సీతాల్ని నిద్రలేపాడు. నిద్రపోతేగా చటుక్కున లేచి వచ్చి కంచం ముందు కూర్చుంది. మౌనంగా అన్నం తింటున్న కూతుర్ని చూస్తూ తనూ మౌనం వహించలేకపోయాడు. నెమ్మదిగా మళ్ళీ లచ్చి ప్రసక్తి తీసుకువచ్చాడు. అంతే! సీతాలు కంచం ముందు నుంచి తుర్రుమంది. మంచం కింద దూరింది. పోలయ్యకు వళ్ళు మండింది. వేలెడు లేదు? దీనికెంత పొగరు? తన మాట చెవిన పెట్టడంలేదు. బొత్తిగా భయభక్తులు లేకుండా పోయాయి. నిప్పంటించిన టపాకాయలా

ధాం అంటూ లేచాడు ఒక్క అరుపు అరచి. సీతాల్ని మంచం క్రింద నుంచి బయటకు లాగాడు.

"ఏమిటే! నీ మొండితనం? నాన్న మాట వినాలని ఉండక్కర్లేదూ? నోరులేని లచ్చి మీద ఎందుకే నీకు ఇంత కసి?" నిశ్చేష్టురాలై నిలబడింది సీతాలు. ముందెన్నడు తండ్రి కోపాన్ని రుచి చూడలేదు. కొడతాడేమో అన్న భయంతో ఆ లేత మనస్సు రెపరెపలాడుతోంది. "కాని నాన్నకు లచ్చి మీద ఎందుకంత ఇష్టం ఉండాలి?" అది తనకేం తమ్ముడనా? చెల్లి అనా తనతో సరిగ్గా ముద్దు చేసేస్తాడు. సీతాలు ముఖం క్రోధంతో ఎర్రబడింది. "లచ్చి ఎవ్వరే? అది మనింటికి దేవత. "దెయ్యం" సీతాలు చెంప చెళ్లుమంది. "కొట్టు! నాకేం భయం లేదు. కాని అది రాక్షసి! దాన్ని ఏమైనా అనొచ్చు. దేవతో దేముడో కాదు. ఉత్త కోతి ముండ" ఈసారి సీతాలు వళ్లు హూనమైంది. చేతికొచ్చినట్టు కూతుర్ని బాది కుక్కి మంచంలో కూలబడ్డాడు పోలయ్య. సీతాలు కొంతసేపు పెద్ద పెట్టున ఏడ్చింది. తర్వాత లోలోన కుమిలి కుమిలి ఏడ్చింది. నిద్రలో కూడా వెక్కిళ్ళు పెట్టింది. పోలయ్య కూతురు ఏడుస్తుంటే మెదలకుండా ఉన్నాడు. అందుకతను ఎంతో తీవ్ర ప్రయత్నం చెయ్యవలసి వచ్చింది. తనకెంతో అపురూపమైన తన సీత ఏడుస్తుంటే చూడగలడా? తనే తన సీతని కొట్టి, తిట్టి ఏడ్పించాడు. అది అతనికి మరీబాధగా ఉంది. బాధ పడకపోవటానికి అతని గుండె బండకాదు. అసలే మొండికేసిన సీతని మళ్ళీ వెంటనే తనే చేరదీస్తే ఎలా అని మనస్సును అదిమి పట్టాడు. అందుకే ప్రతి బిడ్డకి తల్లీతండ్రీ ఉండాలి. తన సీతకే తల్లి ఉంటే తను కొట్టినపుడు ప్రేమగా గుండెల్లో దాచుకునేది. అయితే సీతని తల్లీతండ్రీ తనే అయి సాకాల్సి వచ్చింది. అందుకు తనేమైనా బాధపడ్డాడా?" రాత్రి పగలు కంటికి రెప్పలా చూసుకోలేదూ! ఏం లోటు చేసాడు? అసలు ఈ రోజు కూడా చెయ్యి చేసుకోక పోయేవాడే. కాని తమ ఇద్దరి జీవనాధారమై నిలచిన లచ్చిని ఇంటి నుంచి తరిమేయమని ఒకటే పట్టుబడితే నయానా భయానా నచ్చ చెప్పేందుకు ప్రయత్నించాడు. తన మాట పడనిస్తేనా? చివరికి ఇలా చెయ్యవలసి వచ్చింది.

ఏమైనా తనిలా కఠినంగా ఉండక తప్పదు. తండ్రి అంటే భయపడడం నేర్చుకోవాలి. అలా నిశ్చయించుకున్నాక అతని కళ్ళమీద నిద్ర తెర వాలి పోయాయి. తెల్లవారి ఆ తండ్రీ కూతుళ్లు ఎవరి పనుల్లో వారు పడ్డారు. అంతా మౌనంగా సాగిపోతోంది. సీతాలు తండ్రితో ముచ్చటైతే ఆడలేదుకాని తనకు తోచినంత ఇంటి పనిలో సాయం చేసింది. లచ్చిని మాత్రం పట్టించుకోలేదు. పోలయ్య ఎప్పటిలా సైకిలుపై స్కూలుకి దిగబెడతానంటే తనే వెడతానంది. లచ్చిని తీసుకుని నగర వీధులలోకి వెళ్ళిపోయాడు. లచ్చి హుషారుగా ఆటలాడలేదు. ఏదో అది అతని పక్కన ఉండటంతోనే పోలయ్య జేబు నిండింది. అసలు తన తాత తండ్రుల నించి ఇదే వృత్తి. కోతిని పెంచి ఆటలాడిస్తూ, తమ నైపుణ్యాన్ని మెచ్చి జనం రాల్చే దానితో

ఆధారపడి బతుకుతున్నారు. తనూ అదే నేర్చుకున్నాడు. ఓ కోతిని చేరదీసి ఆటపాటలు నేర్పాడు. తను పెట్టుకున్న పేరు సార్థకం చేసి మాలచ్చి అతనికి లక్ష్మీ కటాక్షానికి కొరత రానివ్వలేదు. పైడమ్మతో జీవితం పెనవేసుకున్నాక కూడా అతనికి కొరత రానివ్వలేదు. ఈ ఇంట్లో మూడే జీవాలు అన్నట్టు సీతాలు కళ్లు తెరవగానే పైడమ్మ కళ్ళు మూస్తే మాత్రం, పోలయ్య బాధ్యత పెరిగింది. పసిబిడ్డ ఆలనా పాలనా చూసుకుంటూనే లచ్చిని కూడ కంటికి రెప్పలా సాకాడు.

పారాడే పసితనం నుంచే సీతాలుకి లచ్చి నేస్తం అయింది. అనుబంధం సీతాలుతో పాటు పెరుగుతూ వచ్చింది. బడికి వెళ్ళొచ్చాక లచ్చికి బోధపడక పోయినా తన పాఠశాల సంగతులన్నీ దానికి చెప్పేది సీతాలు. పసి మనస్సులు పాల కుండలు అన్న మాట నిజమేనేమో. ఆ పాల మనస్సులో విషబిందువు పడింది. లచ్చిపైన సీతాలుకి అపారమైన ద్వేషం నిండింది.

ఆ రోజు స్కూల్లో ఆట లాడుతూ అంతా పరుగులు పెడుతున్నారు. సీతాలు తను అందరికన్నా ఫస్టు రావడంతో ఎగిరి గంతులేసింది. "పరుగు పందెంలో నాతో ఎవరు పోటీకి రాలేరు" అని నవ్వింది.

పిల్లలంతా ఒక్కసారిగా "ఏం నవ్వు? కోతి నవ్వు! ఏం గంతులు? అవే కోతి గంతులు!" అంటూ గొల్లుమన్నారు. సీతాలు అర్థం కాక తెల్లబోయింది. "ఎందుకలా చూస్తావు? మీ నాన్న కోతిని పెంచుతున్నాడు. నువ్వు రోజూ కోతితోనే ఆడుకుంటావు. కోతికి నువ్వే స్నానం చేయిస్తావటగా. రకరకాలుగా ఎగతాళి చేసారు తోటి పిల్లలంతా. సీతాలు ఎంతో స్నేహంతో చూసుకుంటున్న లచ్చి అపుడే సీతాలు మనస్సులో కోతిగా వికృత రూపం దాల్చింది. అది కోతే! అది లేకపోతే నాకేం అవుతుంది? అసలది ఎందుకు? నాన్నతో చెప్పి తరిమేయాలి. అంతే ఆ క్షణం నుంచే పోలయ్య ఇంట్లో రగడ ప్రారంభమయింది. రోజులు వారాలుగా మారాయి. సీత మానసిక స్థితిలో పోలయ్య ఆశించిన మార్పు రాకపోయినా దేనికీ గొడవ చేయటం లేదు. ఇదీ కొంత నయమే అనుకున్నాడు.

ఆ రోజు సీతాలు స్కూలు నుంచి వచ్చేసరికి పోలయ్య సంచిలో బట్టలు సర్దుకుంటున్నాడు. ఊరెళ్దామా నాన్నా? నా గౌన్లు పెట్టుకోనా? అని అడగాలనిపించినా తన మౌనవ్రతాన్ని భంగపరుచుకోలేదు. పోలయ్యే చెప్పాడు. "తొందర పని మీద ఊరెళ్ళాలని రేపే వేళకు తిరిగి వచ్చేస్తానని, ఈ ఒక్కరోజూ లచ్చితో కలిసి ఉండమని సీతాలుని బ్రతిమిలాడాడు. ఇంతవరకు పెదవి కదపని సీతాలు "అలాగే! దాన్ని బాగా చూస్తా! మేం కలిసే ఉంటాం నాన్నా!" అనే సరికి పోలయ్య మనస్సు సంతోషంతో నిండిపోయింది.

తన రెండు కళ్ళ లాంటి ఆ ఇద్దరినీ ఆత్మీయంగా చూస్తూ పనై పోగానే వచ్చేస్తా. మంచి మంచి మిఠాయిలు తెస్తా. మీరిద్దరూ జట్టుగా ఉండండి. అమ్మా! సీతా నీకు రిబ్బన్లు, గాజులు

కూడా తెచ్చిపెడతా" అంటూ ముందుకు సాగిపోయాడు. తన కంటికి అందనంత దూరం వెళ్ళి పోయేదాకా లచ్చి తన యజమానిని ప్రేమగా చూస్తూ నిలబడింది. రెండు చేతులతోనూ లచ్చిని పొదివి పట్టుకుని లోపలికి నడిచింది సీతాలు. ఆప్యాయంగా సాకటం సంబరంగా అనిపించిన లచ్చి ఆమెను చుట్టేసింది. లచ్చితో ఆటలాడుతూ దానికిష్టమైన పాయసం నంగి..డి. కడుపు నిండా తినిపించింది. శ్రీకాంత్ దగ్గరికి పరుగెత్తింది. తండ్రి తనని ఊరికి తీసుకెళ్ళక పోవటం మంచి పనే! తన కంట్లో నలుసులా తయారైన ఈ లచ్చిని వదిలించేసుకోవచ్చు. "ఏం సీతా! ఇలా వచ్చావు?" స్నేహితునితో క్రికెట్ ఆడుతున్న శ్రీకాంత్ అన్నాడు. "ముందు నాతో రా ఆ దెయ్యాన్ని వదిలించేద్దాం" అతని చెయ్యిపట్టి లాగింది. "సరిగ్గా చెప్పు సీతా నాకేం అర్థం కావటం లేదు" ఆమెతో నడుస్తూ అన్నాడు. "ఆ కోతి ముండ పని పడదాం. మా నాన్న ఊళ్ళో లేడు. వాచ్చేలోగా మనం అనుకున్నట్టు చేసామో... మరెప్పుడూ కోతి గోల ఉండదు. నన్నెవరూ ఎగతాళి చెయ్యలేరు" సీత చెబుతున్నది ఏమిటో ఇప్పటికి తలకెక్కింది శ్రీకాంత్‌కి. పాపం సీత అందరూ వెక్కిరిస్తుంటే మనస్సు పాడుచేసుకొని తన దగ్గర రోజూ ఏడుస్తుంది. సీత కళ్ళలో నీళ్ళెందుకు రావాలి? ఆటల్లోను, చదువులోను తనను మించిన వాళ్ళు లేరు చక్కగా పాడుతుంది కూడా! ఆ కోతినించే కదా? స్కూళ్లో పిల్లలంతా వెక్కిరిస్తున్నారు. దీన్నేమైనా అంటే చాలు నాన్న చేతి దెబ్బలు తినవలసి వస్తోంది. తను కనుక సీతకి సాయం చేయగలిగాడో సీత కష్టాలన్నీ మాయమైపోతాయి. ఎప్పుడూ నవ్వుతూ, ఆడుతూ, పాడుతూనే తనకి కనిపిస్తుంది. అనుకున్నాడు. శ్రీకాంత్ కూడా వెంటనే లచ్చిని మచ్చిక చేసుకున్నాడు. అరటిపళ్ళు తినిపించాడు. గంటల తరబడి ముగ్గురూ గంతులేసారు. ఆ రోజుకి ఊళ్ళో సర్కస్ షోలు పూర్తయ్యే సమయానికి అక్కడికి చేరుకున్నారు. "మీరు ఊళ్లోకి రాగానే ఈ లచ్చిని కావాలన్నారుగా. ఇదిగో తీసుకువచ్చాం."

ఆ సర్కస్ కంపెనీ మేనేజర్ నారాయణమూర్తి ముందు కోతిని నిలబెట్టి అన్నాడు శ్రీకాంత్. "ఓ హోహో! తీసుకు వచ్చారా మరి. దీని యజమాని దీన్ని అమ్మేయటం తన కిష్టం లేదన్నాడే?" సీతాలు ఆశ తీరదేమో అన్నట్టు భయంగా చూసింది శ్రీకాంత్‌వైపు. శ్రీకాంత్ చూపులతోనే సీతాలుకి ధైర్యం చెప్పి నారాయణ మూర్తితో అన్నాడు. "అదంతా మీకెందుకు సార్? దీని ఆట పాటలకి ఆశ్చర్యపోయి మీరు అడిగారు. నేను ఇస్తున్నా.... తీసుకోండి!". "అవును మీతో తీసుకు వెళ్ళిపొండి మా అయ్య మిమ్మల్ని ఏమి అనడు" అయినా రేపే మీరు వేరే ఊరు వెళ్ళిపోతున్నారుగా! శ్రీకాంత్ మాట పూర్తి చేసి లచ్చిని అప్పగించేశాడు. ఇద్దరూ వెనుదిరగ బోతుంటే నారాయణమూర్తి అడిగాడు "అయితే మీకేమిమ్మంటారు?"

"ఏమి అక్కర్లేదు! ఇది ఇంట్లోంచి వెలితే అదే పదివేలు". నిజంగా పదివేలు సంపాదించినంత సంబరం ఆ ఇద్దరి మాటల్లోనూ తొంగి చూసింది.

లచ్చి లేని ఇల్లు పోలయ్యకి కళావిహీనంగా తోచింది. "సీతా! లచ్చేది" ఆశ్చర్యంగా అడిగాడు. "లేదు. లచ్చి ఇక ఈ ఇంట్లో కనిపించదు". కూతురి జవాబుకి మరింత విస్తుపోతూ "ఏది ఎక్కడ ఉంచావు లచ్చిని" అన్నాడు. అది ఎక్కడుంటేనే? ఆ కోతి మొహం కనబడకపోవటమే నాకు కావాలి. నాతో సమానంగా దాన్ని ముద్దు చేసావు కదూ. అందుకే మీ ఇద్దరికి మంచి శాస్తి చెప్పాన్లే". పోలయ్య నిలువునా ఒణికిపోయాడు. ఖచ్చితంగా సీతాలు లచ్చిని ఇంటి నుంచి తరిమేసింది. ఇప్పుడు తను ఏం చెయ్యాలి? జరగరాని ఘోరం జరిగి పోయింది. లచ్చి, తమ ఇద్దరి బ్రతుకు తెరువు కారణమని, అది తెచ్చి పెట్టే సంపాదనతోనే నిన్ను పెంచి పోషిస్తున్నానని సీతాలు లేత మనస్సులో నాటుకునేలా చెప్పి ఉండవలసింది. అప్పుడు ఆ పసి హృదయంలో లచ్చి స్థానం వేరుగా ఉండేది. లచ్చిని కూడా తండ్రి ప్రేమతో చూస్తున్నందుకు సీతాలు కసి కట్టింది. తన పొరబాటు వల్లే ఇంతా.... జరిగింది.

చిన్నపిల్ల మొండికేసిందని తను మూర్ఖంగా ప్రవర్తించాడు. ఫలితం తమ నోటి దగ్గర కూడు పోయింది. తన కూతురి భవిష్యత్తు కూలిపోయింది. చేద్దామన్నా తనకు ఇంకే పని పాటలు చేతకావు. తల పట్టుకుని చతికిల పడిపోయిన తండ్రిని ఇంకా కక్షగానే చూస్తూ "దయ్యం వదిలిపోయిందని బెంగపడి పోతున్నావా?" విసురుగా చేతులు తిప్పుతూ అంది. పోలయ్య భోరుమన్నాడు. కూతురికి విషయం అంతా వివరించాడు. తన తప్పు తెలుసుకున్న సీత తండ్రి దుఃఖంలో పాలు పంచుకుంది. "మరేం చెయ్యలేం నాన్నా. వాళ్ళు ఏవూరు వెళ్ళిపోయారో కూడా మాకు తెలీదు" అంది వెక్కిళ్ళు పెడ్తూ. "తప్పంతా నాది తల్లీ!"

"చేతులు కాలాక ఆకులకోసం వెతుక్కొనే అవివేకిని. నన్ను నేను ఎలా శిక్షించు కోగలను?"

సీతాలు మెదడైతే మొద్దుబారిపోయింది. ఏ మనిషి ఎలా బ్రతుకుతున్నాడో ఎవరికి ఏ మొత్తరు చేయూత నివ్వాలో అని రవ్వంతైనా ఆలోచించని సమాజం, ఎలా వేలెత్తి చూపాలో, ఎలా పరిహసించాలో అన్న ఆలోచనలకి స్వస్తి చెప్పదు. ఫలితం పసిపిల్లల్లో సహితం ఆ భావాలే జీర్ణించుకుపోతాయి. తోటి పిల్లలు హేళనకు గురైన సీతాలు ఇంత సాహసించింది. ఏ వృత్తిని కించపరచని, ఏ పనిని తేలికగా చూడని సమాజం ఎప్పటికి రూపొందుతుందో? వేచి చూడాల్సిందే.

*డిశంబర్ 14 1998 జాగృతి వారపత్రిక* ❑